వివాహం అయి సరిగా రెండు సంవత్సరాలైనా నిండీ నిండకముందే భర్త రంగారావు మరణించడం సరస్వతికి చాలా కోపాన్నీ, చికాకునూ కలిగించింది. అట్లని ఆమెకు అసలు ఏమాత్రం విచారం కలగలేదనీ కాదు. జడలో గుచ్చుకునే పిన్ను పోయినా- యిల్లంతా వెతికి వెతికి చివరికి నౌకర్ని బజారుకు పంపి, కొత్తపిన్నులు తెప్పించుకునేది. ఆసందర్భాల్లో ఆమెకు కలిగేది అచ్చగా కోపమేనా అంటే- కాదు, విచారంకూడా! కాని యిప్పుడు జరిగిన యీలోటు ఏనౌకర్నో బజారుకు పంపి, తేలిగ్గా పూర్తి చేసుకోగలిగింది కాదు. తానే ఎంతో ఓర్పుతో, తెలివితేటల్నీ, అందాన్నీ- ముఖ్యంగా ఎంతో విచక్షణాజ్ఞానాన్ని వుపయోగించి ఆ లోటును భర్తీ చేసుకోవాలి.

"అంతగా ప్రపంచానుభవం లేని దానివి, మీ ఆయన బోలెడాస్తిని నీపేర పెట్టి పోయాడు. నీవు మళ్ళీ పెళ్ళి చేసుకునేందుకు మేమెవరమూ అభ్యంతరం చెప్పం. కాని...కాని ఆవొచ్చే మొగవాళ్ళు నీకోసం వస్తున్నారో, లేక నీఆస్తికోసమో బాగా ఆలోచించి మరీనిర్ణయానికి రావాలి".

భర్తపోయిన నెలరోజుల తరవాత, తనను ఓదార్చేందుకు వచ్చిన పిన్ని చెప్పిన యీమాటలు, యిప్పటికీ సరస్వతి చెవుల్లో ప్రతి ధ్వనిస్తూనే వున్నై. పిన్నిలో ఎంత అనుభవం వుంది! ఎంత లోకజ్ఞానం!

కిటికీ దగ్గరగా కుర్చీ లాక్కుని ఒక రెక్క తెరిచి సరస్వతి ఆలోచనలో మునిగి పోయింది.

తను ఎవరితోనూ చెప్పలేదు- అయినా అసలు అలాటిభావాన్ని కలిగివుండడమే ఎంతో దారుణంగా అందరూ భావిస్తారు. కాని స్వగతంగా అనుకోవచ్చు.

భర్త చనిపోయినరోజున తనకు ఎంత సంతోషం కలిగింది!

సరస్వతి నిలువుటద్దం ముందుకు వెళ్ళి నుంచుని- నిలువెల్లా ఒక్కసారి చూసుకుని నవ్వుకున్నది- గదితలుపుకు లోపల గడివేసివున్నదో లేదో అని ఒకమారు తలుపువంక చూసి.

"నీవు అదృష్టవంతురాలవమ్మాయ్. నీయౌవ్వనాన్నంతా కొంచెం కొంచెంగా పిండుకుతాక్కముందే- కనీసం ఏఒకరిద్దరు పిల్లలో కలక్కముందే- ఆపీడ వొదలిపోయింది."

కిలకిల నవ్వుకుంటూ ఆమె తిరిగి కిటికీ దగ్గర కూర్చున్నది.

లోకంలో ఏదంపతులూ, ప్రథమరాత్రే, ప్రథమానుభవంలోనే ఒకళ్లకి ఒకళ్ళు నచ్చకపోవటం అంటూవుండదు. కాని తను ఆతొలినాటి రాత్రే, రంగారావును ఎంతగా అసహ్యించుకున్నది, ఎంతగా ద్వేషించింది!

తను సిగ్గువల్ల మాట్లాడలేక పోవడానికీ భయంవల్ల మాట్లాడలేక పోవడానికీ, భయంవల్ల అతడి పట్టు వదలించుకునేందుకు చేసే ప్రతి ప్రయత్నానికీ, అతడు ఏదో ఒక దుష్టకారణాన్ని వూహించి ఎంతగా తనను బాధపెట్టాడు. ఎంత నీచమైన అనుమానాలు వెలిబుచ్చాడు!

"యిదిగో! యీ నీరంకుకు వాత్స్యాయనుడు చెప్పే కారణం యిది. ఆభయానికి...వాడెవడో ఆ ఇంగ్లీషు పేరు ఆమెకు గుర్తులేదు- యిచ్చేజవాబు - యిది నేను సర్వీస్ కమిషన్ ప్యాసవకుండా వుద్యోగం కోసం ప్రయత్నించలేదు. అలాగే యీవుద్యోగానికి అవసరమైన శాస్త్రాన్ని చదవకుండా నేను పెళ్ళి చేసుకోలేదు' యింతకీ- మీయింటిపక్క—వాడితో—' యిదీ వరస! అలాంటి భర్త చనిపోతే యితర్ల కళ్ళనీళ్ళు తుడిచేందుకు తను ఆనాడు భోరుమంటూ ఏడ్చినా- సంతోషించకుండా ఎలావుండగలదు?

తను పునర్వివాహం చేసుకోవడం నిశ్చయం. దాన్ని వీరేశలింగంగారైనా ఆపలేడు. కాని ఎవర్ని?

సరస్వతి కలం తీసుకుని వరసగా తన యింటికి, తన కోసం వచ్చి పోతూండే పురుషుల పేర్లు రాయడం మొదలుపెట్టింది. యీ వచ్చే వాళ్ళల్లో ఎవరు తన కోసం; ఎవరు తన ఆస్తికోసం?

వెంకటస్వామి! దొంగ. వీడిదృష్టి ఎప్పుడూ తన మీదకంటె, తన కుర్చీల మీదికీ, వెండికంచాలూ, గ్లాసులూ, యినపపెట్టెమీదకీ పోతూవుంటుంది.

శంకరం : వీడికి తను కావాలో, లేక తన ఆస్తికావాలో, రెండూ కావాలో అసలు రెండూ అక్కర్లేదో చెప్పడం కష్టం. తన ఎదట ఎప్పుడూ చలిజ్వరంతో బాధపడుతూన్న వాడిలా వణుకుతుంటాడు. అచ్చగా కొమ్ముల్లేని పొటేలు.

సారధి : వీడు...సరస్వతి గబగబా ఆ 'వీడు' అదిరాసిన దాన్ని కొట్టేసి, కలం టేబిలుమీద పెట్టి, కుర్చీలో చేరగిల ఒక దీర్ఘమైన నిట్టూర్పు విడిచింది. శరీరం పులకరించినట్టూ, పమిట జారిపోతున్నట్టూ, తనను ఏవో రెండు బలమైన హస్తాలు అలా కుర్చీలోనుంచి పైకి ఎత్తి గగనమార్గాన ఎత్తుకు పోతున్నట్టూ ఏదో అనిర్వచనీయమైన బాధా, వుద్రేకం, విభ్రాంతి అలాకప్పేస్తున్నట్టు, తను

ఊహించుకునే స్వాప్నికలోకాల తలుపులు తెరుచుకున్నట్టూ ఆమె హృదయం శరీరం-రెండూ తన్మయత్వంలో చిందులు తొక్కినై.

సరస్వతి గట్టిగా నేత్రాలను బంధించి సారధినుంచి, ఆకోటూ...యింకా ఆ సంబంధమైన కల్పిత ఆటంకాలని వేరుపరచి-అతడికి ప్రకృతి ప్రసాదించిన వాస్తవిక రూపాన్ని తన సర్వేంద్రియాలతో బంధించి, పరీక్షను వుపక్రమించింది.

తక్కిన మగజాతినుంచి అతన్ని వేరుపరుస్తున్న లక్షణాలేమిటి? ఆవుంగరాల జుట్టూ, కండలు తిరిగిన శరీరం, అతివిశాలమైననేత్రాలూ, యెత్తయినవక్షస్థలం...! సరస్వతి దీర్ఘంగా మరోమారు నిట్టూర్చింది.

కండలూ, విశాల నేత్రాలు మాత్రమే లెక్కలోకి తీసుకుంటే - వెంకటస్వామికి నలుగురికి సరిపడేంత పెద్దకళ్ళూ, ఆ శంకరానికి మరో యిద్దరికి బదులు యివ్వగలిగినంత శరీరం కండలూ వున్నై. కాని-సారధిమనిషే వేరు! అసలు బ్రహ్మకి తెలీకండా, ఆయనభార్య స్వంతానికి యీ పూర్ణమానవుణ్ని తయారు చేసుకుని ఏ పవిత్ర బాధ్యతో గుర్తుకు రావడంవల్ల యీ జీవిని కళ్ళు మూసుకుని భూలోకానికి జారవిడిచి వుంటుంది. ఆడవాళ్ళని సృష్టించే బాధ్యతను తీసుకుని మగ వాళ్ళను తీర్చిదిద్దేపని భార్యకు వదిలేస్తే-ఆలోకంలో యింత స్వల్పంగా సారధిలాంటి అందగాళ్లు పుట్టడం, వాళ్ళని ఆకర్షించేందుకు తనలాంటి వాళ్లు యితర్లతో పోటీ చేయవలసిన అవసరం కలక్కపోదు.

ఇంతకీసారధి తనను ప్రేమిస్తున్నాడా? అతడి వుంగరాల క్రాపులాగానే అతడి హృదయం వెలిబుచ్చే భావాలుకూడా చాలా చిక్కగా గజిబిజిగా వుంటై. కాని ఒకటిమాత్రం నిజం. అతడు తన ఆ స్త్రీకోసం మాత్రం తనయింటికి రావడం లేదు. అసలు అంత ఖరీదైన సూట్లువేసే, అంత అందంగావుండే పురుషుల దృష్టి యెప్పుడూ రూపాయిలూ, అర్ధరూపాయిల మీద లగ్నంకాదు. వాళ్లు తమ సౌందర్యానికి యీడువచ్చే సౌందర్యం కోసం ప్రయత్నిస్తుంటారు. అయితే తనలో సారధిని ఆకర్షించేంత అందం, యౌవ్వనం వున్నయ్యా?

సరస్వతి కుర్చీలోనుంచిలేచి అద్దం ముందుకు వెళ్లింది. రోజుకు లెక్కపెట్టలేనన్ని మార్లు అదే అద్దంలో—అదే రూపాన్ని చూసుకున్నా-ఆనాడు ఆమెకు ఏదో పరీక్షలో కూర్చున్నట్టు, యెవరితోనో పోటీచేసి గెలిచేందుకు ప్రయత్నిస్తున్నట్టు తోచింది. తనరూపాన్ని అన్ని వైపులనుంచీ పరిక్షించుకుని తృప్తితో తల వూపింది. అవును తన అందం నేత్రాలు లేని వాడుకూడా గ్రహించ గలిగినంత గొప్పది. మరి అంతపెద్ద నేత్రాలతో సారధి.........

బయిట ఎవరో తలుపుతట్టారు. సరస్వతికి చెడ్డచిరాకు కలిగింది. తన తీయని వూహలకి అంతరాయం కలిగించే వీళ్ళెవరుని? సారధిమాత్రం కాదు. అతడు ఆవేళలో ఎప్పుడూ రాడు.

ఆమె చాలా కోపంగా, బిగ్గరగా ప్రశ్నించింది. "ఎవరూ?"

"నేనమ్మా! నేను".

ఓసి పనిదయ్యమా అనుకుంటూతలుపు

తెరిచింది "ఎందుకు?"

"పోస్టు జవాను వచ్చాడు. వుత్తరాలు..."

"యీమాత్రానికి నన్నెందుకు పిలవాలి? నువ్వు ఎందుకు తేగూడదు?"

"ఏదో రిజిష్టరు వుత్తరం - మీసంతకం కావాలంటున్నాడు"

సరస్వతికి భయాశ్చర్యాలు రెండూ కలిగినై. రిజిష్టరువుత్తరం ఏమిటి?

సంతకంపెట్టి వుత్తరం తీసుకుని, కవరు విప్పింది. ఏదో కోర్టుముద్రలు ! సాంతం చదివి విసుగ్గా నేలకు కొట్టింది.

"అంతగా, ఆయనరాసిన యీ ఆస్తి నాకు చెల్లదనే నమ్మకం వున్నవాళ్ళు, దావాకు పోవడం ఎందుకు చక్కగా వచ్చి ఆక్రమించుకోక".

సరస్వతి మాటలువిని పనిమనిషి ఆదుర్దాగా అడిగింది "ఏం జరిగింది అమ్మగారూ! ఏం జరిగింది?"

"ఆస్తి నాకు రాయడం చెల్లదంటూ ఆయనచెల్లెలూ వాళ్ళూ నామీద దావా వేశారు".

పనిమనిషి మాట్లాడలేదు. సరస్వతి దాని మౌనానికి ఆశ్చర్యపోయి - ముఖంవంక నిదానంగా చూసింది. దానిముఖంలో నిర్లక్ష్యతా, అలసభావం స్ఫుటంగా కనబడుతున్నై.

"అవును యింత ఆస్తివుండడంవల్లే వీళ్ళంతా నాచుట్టూ తిరుగుతూ, అడుగులకు మడుగులొత్తుతున్నారు. అదికాస్తాపోతే ఆఖరికి సారధికూడా..."

ఆభావాలకి సరస్వతి అంతటితో స్వస్తిచెప్పింది. వణుకుతున్న చేతుల్తో - ఆకిందపడి వున్న వుత్తరాన్ని తీసుకుని లాయరు దగ్గిరకు బయలుదేరింది.

సరస్వతిని చూస్తూనే, అడ్వొకేట జగన్నాధం కుర్చీలోనుంచి లేచి రెండు చేతుల్తో ఆహ్వానించాడు. అతడు చేసే మర్యాదా కనపరచే విచక్షణాచూస్తే అతడు తన కోసమే "లా" చదివాడా అన్నట్టు ఆమెకు తోచింది. వుత్తరం సాంతం ఓమారు చదివి___

"యీ దావా మనను ఏమీచేయదు. యీకేసు నాదిగాచూచుకొనిపని చేస్తాను. ఒక్కమారు మాత్రం మీరు రంగారావు రాసిన విల్లుకు సంబంధించిన కాయితాలు చూపించాలి".

"అయితే సాయంత్రం తెస్తాను" లాయరు మాటలు సరస్వతికి ధైర్యాన్ని కలిగించినై.

"వద్దు! వద్దు! నేనే మీ యింటికి వస్తాను. రంగారావు నాక్లాసుమేటు. పైగా నేను బ్రహ్మచారిని - యింటివద్ద పనికూడా ఎక్కువలేదు."

సరస్వతి అతడికి నమస్కరించి బయటకు వచ్చింది. తను శెలవుచెప్పేటప్పుడు అడ్వొకేటు వేసిన పోజుచూస్తే, ఆమెకు నవ్వూ, అసహ్యం కలిగినై. భగ్నప్రేమతో జీవితం మీద విసిగి, మేడమూడో అంతస్థునుంచి రోడ్డుమీదికి దూకి ఆత్మహత్య చేసుకునేందుకు తయారయ్యే న్యూథియేటర్సు ట్రాజడీ యాక్టర్లాగా అతడు ముఖంపెట్టాడు. తను బ్రహ్మచారినంటూ చెప్పడం అప్రస్తుతం. లోకానికి తనంటే పిచ్చి ఎత్తింది. యింతకీ వాళ్ళకు కావలసింది తనా లేక జార్జిటౌన్‌లోని రెండుమేడలూ, యిరవై ఎకరాలపొలమూ?

ఆమెను యీప్రశ్న ఆరోజల్లా బాధిం

చించి. మొత్తంమీద, దావా తనను ఏమీ చెయ్యలేదు. ఆ విషయంలో ఏమాత్రం అనుమానంవున్నా, లాయరు ముందుగానే ఫీజు అడిగేవాడు - తరువాత ఆపక్షి పోజు వేసేవాడు కాదు.

సరస్వతి ఆసాయంత్రం టాయిలెట్ అయ్యేందుకు మామూలుకన్న ఓఅరగంట కాలం ఎక్కువ వినియోగించింది. ఆరు గంటలకల్లా తప్పకండా సారథివస్తాడు. దావా విషయం అతడితో చెపితే ఎలా ఫీలవుతాడో చూడాలి. తనహృదయాన్ని కూడా కొంతవిప్పితే... ఆమెకు వెంటనే పిన్ని చేసిన హెచ్చరిక గుర్తుకొచ్చింది. తన పునర్వివాహానికి ఆ రెండుమేడలూసహాయ కారులు కాకపోగా, తన ఆనందానికి అడ్డువచ్చే రెండు సజీవభూతాల్లాగా ఆమెకు తోచినై.

కిందమెట్లమీద చప్పుడయింది. సరస్వతి ఆవైపుకు ఓమారు చూచి అద్దంలోకి నవ్వింది. అతడు వస్తున్నాడు, అతడిరూపంలోవున్న విలక్షణతే, అతడు మెట్లమీద చేసేశబ్దంలో కూడా వుంది. అడుగుల చప్పుడునుబట్టి సారథి అవునో కాదో తను చెప్పగలదు.

గదిలోకి వస్తూనే 'నమస్తే' అన్నాడు. సరస్వతి అతణ్ని చూస్తూనే తన్మయత్వం చెందింది. నిలువుపాపిటితో, నిలువునాకొత్త సూటువేసి అతడు ముందుకువస్తూంటే - ఓఅత్తరు దుకాణాన్ని మన్మధుడుమోసుకొస్తున్నట్లు ఆమెకు తోచింది.

మామూలు ధోరణిలోనే సంభాషణ సాగింది. ఆరోజు పట్టణంలోని సినిమాలు పుష్పవల్లి, కన్నాంబ, చల్లారాం సిల్కుషాపులోకి కొత్తగా వచ్చినచీరలూ, యింటిపక్కనవున్న షాహుకారుమూడో భార్యముచ్చటా - అంతా.

సరస్వతి యీ మామూలు చర్చలన్నీ ముగిసినతరువాత, నిబ్బరంగా అన్నది.

"నామీద - ఆయనచెల్లెలూ వాళ్ళూ ఆ స్తికోసం దావా వేశారు".

సారథి వులిక్కిపడ్డాడు. అతని మొహానికి అడ్డంగా, ఓ విషాద మేఘం యిట్టే దాటిపోయింది.

"ఎవరు చెప్పారు?"

"యివ్వాళే రిజస్టరు వుత్తరంవచ్చింది. తాయారుతో..."

సారథి ఆమె మాటకు మధ్యలోనే అడ్డువచ్చి- "లాయరు ఏమన్నాడు?" అని ప్రశ్నించాడు.

"అతడు ఏమీ భయపడవలసిన పని లేదన్నాడు."

సారథి బాగా కుర్చీలో ఆనుకుని సిగరెట్టు ముట్టించాడు. అతడిలో ఏదో మధురభావం కట్టలు తెంచుకుని బయట పడేందుకే ప్రయత్నం చేస్తోందని సరస్వతి గ్రహించింది.

"ఒక వేళ నాఆస్తి అంతా పోతుందనుకోండి. అప్పుడూ మీరుయిలాగే..." అతడు తల నాజూకుగా ఓపక్కవంచి "నేను మీఆస్తిచూసి మీయింటికి రావడం లేదు" అన్నాడు.

ఎన్నడూలేనిది ఎందువల్లో ఆ సమయంలో—అతడి కుడికన్ను మాత్రం సెకండు కాలంలో మూసుకుపోయి, యిట్టే తెరుచుకున్నది. సరస్వతి కలవరపడింది. జుట్టూ, చీరా అవసరంలేకపోయినా, అనవసరంగా సరిదిద్దుకుని— చిరునవ్వుతో అన్నది,

"అయితే ఎవర్ని చూసి?"

సారధి కుర్చీలోనుంచి లేచాడు. సరస్వతి ఆవేశంతో సిగ్గుతో కుర్చీలో కుంచుకు పోయింది. రంగారావుకూడా యింతధీమాగా, హుందాతనంతో కాక పోయినా, ఏదో కొన్ని ప్రత్యేక వేళల్లో యిలాగే లేచేవాడు.

సారధి ఆమె చెయ్యిపట్టుకుని మీదకు వంగి అన్నాడు. "ఆస్తిఅంతా పోయినా ఆఖరికి కట్టుకున్న యీఖరీదైన పట్టుచీర మీ మీద లేకపోయినా, నేను మీఇంటికి వస్తూనే వుంటాను, ఎవరికోసం..." అతడుకుర్చీలోనుంచి సరస్వతిని బొమ్మను ఎత్తినంత సునాయాసంగా పైకిఎత్తాడు. ఆమెకు స్వర్గానికి చేరేందుకు, యింటి కప్పు అడ్డుకున్నట్టుగా తోచింది.

సారధి మరుసటిరోజునా వచ్చాడు; రెండోనాడూ, మూడోనాడూ, ప్రతి రోజువచ్చి పోతూనేవున్నాడు. అతడే స్వయంగా ఆమె గోడకు తగిలించిన క్యాలెండర్లో తారీఖులు చించుతూండే వాడు. ఆపాత క్యాలెండరు అయిపోయి కొత్త క్యాలెండరు ఆమె తగిలించింది. యింకా అతడు వస్తూపోతూ తారీఖులు చించుతూనే వున్నాడు.

సరస్వతి వివాహం విషయం ఎప్పుడు ప్రొచ్చరించినా, అతడు ఒకే జవాబు యిస్తూండేవాడు. "దావా విషయం తేలిన తరువాత" ఆమెకు ఆ జవాబు చాలా సమంజసంగానే కనపడింది. గెలుస్తామనే గట్టి నమ్మకమున్నా, అది తేలి పోయిన తరవాతనే మనశ్శాంతి కలుగుతుంది.

ఆరోజు యింకా సారధి వచ్చేందుకు రెండు గంటలవేళ వుండగా సరస్వతి ముస్తాబయ్యేందుకు ప్రారంభించింది. ఎందువల్లనో ఆవేళ ఆమెకు రంగారావు గుర్తుకొచ్చాడు.

రంగారావుకూ సారధికీ శరీరతత్వంలోలాగే మన స్తత్వంలోకూడా ఎంతభేదం వుంది. సారధికి తను లేనప్పుడు ఆమె ఏం చేస్తుంటుందనిగాని, యెక్కడికి వెళ్తూంటుందనిగాని ధ్యాసేవుండదు. దావా విషయం గుర్తుకొచ్చినప్పుడు మాత్రం ఏదో కొంతబాధ పడుతూంటాడు. మనిషికి మతిమరుపు జాస్తి. ప్రతిరోజూ యింటి దగ్గరనుంచి వచ్చేటప్పుడు మనిపర్సు జేబులో వేసుకోవడం మరిచిపోవడం— తనే యేదో పదో, యిరవయ్యో అతడికి తెలీకుండా, కోటు జేబులో పెడ్తూండడం పరిపాటి. మనిషికి యెంత మరపు అంటే అలా తను జేబులో వేస్తూండే డబ్బు విషయం యెన్నడూ తనతో అనలేదు. అసలు అలాంటి స్వల్ప విషయాలు అతడికి గుర్తుకురావు. నిండు హృదయం !

మళ్లీ యెవరో బయట గట్టిగాతలుపు తట్టారు. సరస్వతి కోపంతో గట్టిగా కేక వేసింది యెవరు? తనకు యిలాంటి తీయని తలపులు కలిగినప్పుడల్లా ఆపనిమండ ఎప్పుడూ భంగం కలిగిస్తూనే వుంటుంది.

"నేనమ్మా. నేను!"

ఓపని దయ్యమా అనుకుంటూ తలుపు తెరిచింది. "ఎందుకు?"

"లాయరుగారు జవాన్ను పంపారు"

సరస్వతి ఆతృతగా కిందకుదిగివెళ్లింది. శుభవార్తేనా ?

"వాళ్లు వేసినదావా ఓడిపోయింది. మనం గెలిచాం అని జగన్నాధంగారు

మీతో చెప్పమన్నారు. రాత్రికి మాట్లాడేందుకు స్వయంగా వారేవస్తామన్నారు."

ఆమె మారు మాటాడకండా జవాను వుండమని చెప్పి, పెట్టెలోనుంచి పదిరూపాయలుతీసి పనివానిచేత అతడికి యివ్వమని పంపింది.

ఆనందభారంతో, ఆమె కదలలేక కుర్చీలో చేరగిలపడింది. తనతో సారధి వివాహం, దాంపత్య జీవితం, యిక యిద్దరూ బహిరంగంగానే సినిమాలకూ, బీచీషికార్లకూ వెళ్లవచ్చు-దురదృష్టవంతులైన స్త్రీలు ఎంతమంది, తన అదృష్టాన్నిచూసి యీర్ష్య పడతారు ! తనూ సారధీ అటు పారిస్ కార్నర్ లో, మౌంట్ రోడ్డు పొడుగునా, మాంబళం అంతా సొంతకారులో షికారుకు పోతూంటే ఎన్ని ప్రాణులు నిరాశతో ఆత్మహత్యలకు పూనుకుంటై!

సరస్వతికి హఠాత్తుగా ఓ మెరుపులాగా ఓభావం మనస్సుకు తట్టి గిలిగింతలు పెట్టింది. "దావా వాళ్ళు గెలిచారనీ, ఆస్తి అంతా పోయిందనీ సారధికి వుత్తరంరాస్తే అతడు ఎలా ఫీలవుతాడు ? ఎంత ఆదుర్దాగా తన పక్కకు పరుగెత్తుకు వస్తాడు. తరవాత నిజంచెబితే ఎంత ఆశ్చర్యం—ఎంత తమాషా..."

ఆమె గడియారంవంక చూసింది. అతడు వచ్చేందుకు యింకా గంట మాత్రమే వుంది. యీ తమాషా నాటకం ఆడదలుచుకుంటే వెంటనే చేయాలి. కాయితంమీద గబగబా నాలుగుపంక్తులురాసి, పనిమనిషిని పిలిచి రిక్షాలోనే వెంటనే వెళ్లి సారధికి యివ్వమని పంపింది.

పనిమనిషి పావుగంటలో తిరిగివచ్చింది. పనిమనిషికంటే ముందుగా సారధి వస్తాడనుకుంటూ, ఎంతో ఔత్సుక్యంతో ఎదురుచూస్తున్న సరస్వతికి యీ సంఘటన కొంత ఆశ్చర్యాన్ని కలిగించింది.

పనిమనిషి చేతినుంచి కాయితాన్ని తీసుకుని ఆమె చదవ నారంభించింది.

'నీవు తెలియ పరచిన ఘోరదుర్వార్త నామనస్సును కలవర పరిచింది. యిదివరకే నీకు చెపుదామనుకుంటూ మరచిపోయాను; నాకు దీర్ఘమైనగుండె జబ్బువుంది. అంత దైన్యావస్థలో వున్న నిన్నుచూసి, నేను బతకగలగడంకల్ల. కనకఎప్పటికీ ఆఇంటికి వచ్చి నీకండ్ల పడదలుచుకోలేదు. జరిగిన దాన్ని మరచిపో.'

సరస్వతి వుత్తరం చదివి కుర్చీలోనుంచి లేచే ప్రయత్నంలో కాలుజారి గచ్చుమీద పడిపోయింది. సంతతె ధారగా కారుతున్న కళ్లనీళ్లలో క్రమంగా తగ్గిపోతున్న హృదయ స్పందనంలో-అప్పటివరకు అనుమానంగా, అస్పష్టంగా, కదుపులో కదుల్లాడుతున్న ఓమూగజీవితనను ఏదో ప్రశ్నిస్తున్నట్టు తోచింది. జవాబు చెప్పేందుకూ లేచి కూర్చునేందుకూ, ఆమె ప్రయత్నించింది. కాని రెండుపెద్ద మేడలూ, యిరవై ఎకరాల వైశాల్యం గల భూఖండం ఆమె శరీరంమీదా, ఎక్కి-యింకా, యింకా కిందకుఅణచినై.